# మాలక్ష్మి

- యస్.కె. నాగేశ్వరరావు



ఎప్పటిలాగే ఆ రాత్రి కూడా ముద్దుగాగునుస్తూ "ఏమండీ! పనిమనిషిని పెట్టండీ....!" అంది భార్యామణి.

మా పెళ్లయిన ఈ నాలుగేళ్ళలో తను కోరిన నాణ్యమైన కోరిక ఇది. ఈ కోరికను గడచిన ఏడాదికాలంగా కోరుతూనే వుందిగానీ, నేనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు.

అయినా భార్యామణి పట్టువదలని విక్ర మార్కుని కజిన్ సిస్టర్లా తన కోరడం అనే కార్యక్రమాన్ని అలుపులేకుండా 'కొన' సాగిస్తూనే వుంది.

నాక్కూడా ఏదో ఒక రోజున ఆమె రెండో కోరికని తీర్చిపారేస్తానేమోనన్న బెంగగా వుంది!

ఎందుకంటే ఆమె యొక్క ముచ్చటైన మొదటి కోరికని మొదట్లో ఇలాగే కుదరదుగాక కుదరదని తిరస్కరించినా, ఏడాదికాలం అదే పనిగా పోరు పెడుతూ, పడకటింటిలో పాత పల్లవికి కొత్త ట్యూన్ కడుతూ.... పాడుతూ నా చెవిలో డాల్బి సిస్టం సౌండ్‌తో వూదరగొట్టేయడం వల్ల ఓ బ్యాడ్ మార్నింగ్ తీర్చిపారేశాను మరి.

అదిగో, అలా ఆ కోరిక తీర్చిపారేసిన ఖర్మానికి, కనిపెంచి, కంటికి రెప్పలా చూసుకున్న తల్లి దండ్రులకు దూరంగా ఆమెతో కలసి ఇదిగో, ఇక్కడ 'వేరింటి' కాపురంలో పడి అఘోరిస్తున్నానిలా.

నా భార్యామణి పేరు చంద్రకాంతం!

'సూర్యకాంతం అని ఎందుకు పేరు పెట్టలేదా?'ని నేననుకోని క్షణం లేదంటే నమ్మాలి.

ఆకారం కూడా ఆ మహానుభావురాలికి తీసిపోదు.

అయితే సినిమాల్లో గయ్యాళితనం వెలగబెట్టే ఆమె కాస్తా, నిజ జీవితంలో పరమసాత్వికురాలన్న సంగతి నాకు తెలుసు.

కానీ, పేరులోని సాత్వికత వుంది, ప్రవర్తనలో ఘయ్యాళితనం పోయే నా భార్యామణి నైజం గురించి ముందుగా తెలుసుకోలేని నా మంద భాగ్యం కారణంగా ఆమెకు బుక్కవ్వడమేకాక, పర్మినెంటుగా బైండైపోయానుకూడా!

తెలిసిన వాళ్ళంతా 'ఒరేయ్' ఆ అమ్మాయిని నువ్వు భరించలేవు. కనుక ఈ సంబంధం నచ్చలేదని చెప్పేయ్!' అంటూ పెళ్ళి చూపుల సమయంలో హితబోధ చేసినా వినకుండా...

పిల్లలావుగా వుంటేనేం? పేరు బ్రహ్మాండంగా వుందిగా! ఎవరో పెద్దలన్నట్టు పేరులోనే పెన్నిధుందనీ.... నాకీ పేరు, పిల్లా రెండూ నచ్చాయంటూ' ఆ రోజుతో నా గొయ్యి నేనే తవ్వేసుకున్నాను.

ఈ కఠిన వాస్తవం కాస్తా చంద్రకాంతం నా భార్యామణి అయి కూర్చున్న వారంలోనే నాకు బాగా తెలిసి వచ్చింది.

అదెలాగంటే -

మూడు నిద్రల కాలం గడవంగానే, ఇంట్లో వృద్ధులైన నా తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటుందనే ఉద్దేశ్యంతో చంద్రకాంతాన్ని కాపురానికి తీసుకువచ్చేశాను.

నేను ఇంట్లో వారికి ఒక్కడ్నే సంతానాన్ని. అదీ లేక లేక ఆలస్యంగా పుట్టిన పుత్రరత్నాన్ని కూడా.

నాన్నగారు రిటైరయ్యేవేళకి నాకింకా డిగ్రీ కూడా కాలేదు.

అప్పటికి అయిదారేళ్ళుగా అమ్మకి అనారోగ్యం.

ఈ ఇబ్బందుల మధ్య ఎలాగోలా నా చదువు అయిందనిపించినా, అదయిన తర్వాత ఉద్యోగం దొరకడానికి రెండు మూడేళ్ళు పట్టింది.

ఆ వయస్సులో కూడా నా చదువుకోసం, అమ్మ అనారోగ్యం కుదుట పడేందుకు వాడే మందుల కోసం, ఇప్పిస్తున్న వైద్యం కోసం, నాన్నగారు తనకొచ్చే పెన్షన్ సరిపోక, రిటైరయ్యానందున ప్రశాంతంగా నీడపట్టున రెస్ట్ తీసుకోవాల్సిన సమయంలో అక్కడా, ఇక్కడా, చిన్నా, చితకా పనులు చేసి డబ్బు సంపాదించడం చూస్తుంటే నాకడుపు తరుక్కుపోయేది.

ఉద్యోగం రాగానే తండ్రిని, తల్లిని సుఖపెట్టాలని అప్పుడే నిర్ణయం తీసుకున్నాను. దేవుడి దయవల్లో, లేకపోతే నావాళ్ళ శ్రమకి ప్రతి ఫలంగానో మొత్తానికి నేను ఉద్యోగస్తుడ్ని అయ్యాను.

అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ చేతిలో పడిన రోజునే నాన్నగారు చేస్తున్న చిన్నా, చితకా పనులకు మంగళం పాడించేశాను. మీ పెన్షన్ అమ్మ మందులకయినా, నా సంపాదన ఇంటి ఖర్చులకు సరిపోతుందన్నాను.



## సెకండ్ ఇన్నింగ్స్

*'రేలంగి' అనగానే హాస్యనటుడు గుర్తొస్తాడు అలా కలిసొచ్చింది ఈ రేలంగి నర్సింహారావు అనే డైరెక్టర్‌కి బయట చూడ్డానికి సెటిల్డ్‌గా సీరియస్‌గా వుండే రేలంగి తను ఎన్నుకున్న సబ్జక్టులు, వాటిని డీల్ చేసే విధానం, కడుపుబ్బ నవ్వించే రీతిలో ఉంటుంది. కొంతకాలం తెరమరుగైపోయిన రేలంగి, ఇప్పుడిప్పుడే అప్పారావు ఒక నెల తప్పాడు, అమ్మో బొమ్మ చిత్రాల ద్వారా మళ్ళీ వెలుగులోకి వస్తున్నాడు. ఆరోగ్యప్రదమయిన హాస్యం అందించడం రేలంగికే చెల్లు. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఎంత స్కోర్ చేస్తాడో చూద్దాం!*

అమ్మా, నాన్నా చాలా సంతోషించారు!

ఉద్యోగంలో చేరిన ఏడాదికి, పర్మినెంట్ ఆర్డర్లు వచ్చాయి. ఆ రోజే ఇంటి పనిలో అంత అనారోగ్యంతో అమ్మపడే అవస్థలను పర్మినెంట్‌గా తొలగించడం కోసం వెంటనే పెళ్ళి చేసుకోవాలనుకున్నాను.

నా నిర్ణయానికి ఇంటా, బయటా అంతా సంతోషించారు.

లక్షణమైన భార్యకోసం, లక్షల మీద ఆశలు పెట్టుకోకుండా.... 'ఉత్తరం రాయగలిగే, రాస్తే చదవగలిగే అమ్మాయయితే చాలు. కట్నం అక్కర్లేదు. నా వాళ్ళని కనిపెట్టుకుంటూ, నన్నిబ్బంది పెట్టకుండా వుంటే మేలు. అలాంటి అమ్మాయి మీ ఎరికలో వుంటే చెప్పండి' అంటూ తెలిసిన వాళ్ళకి చెప్పాను.

ఆ క్రమంలో నేను పెళ్ళి చూపులకెళ్ళిన మొదటి సంబంధమే చంద్రకాంతం వాళ్ళది. అమ్మాయిది మధ్య తరగతి కుటుంబమే. అయిదుగురు ఆడపిల్లల్లో మూడో అమ్మాయి. ఆ వూళ్ళోనే టెన్త్ అయిందనిపించిందట. వాళ్ళ నాన్నగారు మొదటి ఇద్దరాడ పిల్లలకు పెళ్ళిళ్ళు చేసి, మిగిలిన ముగ్గురికీ ఎలా చేయాలో తెలీక చేతులెత్తేశారు.

నా సంబంధం గురించి తెలిసినంతనే చంద్రకాంతం తాలూకు వాళ్ళు సంబరంగా చంకలు గుద్దుకున్నారు.

'నీదెంత అదృష్టమే అమ్మడూ! తన్నకుండానే బూర్లగంపలో పడ్డావు. అబ్బాయికి గవర్నమెంటుద్యోగం వున్నా కట్నమక్కర్లేదంటా. కాకపోతే, నీవు లావు.... అతగాడు నిన్ను చూసి 'ఝుడుసుకోకుండా' ఒప్పుకుంటే నీ బతుకే బంగారం.....' అన్నారుట.

నేను కూడా పెళ్ళి చూపుల్లో ఆమెను చూసి 'ఇంత లావుగా - వుందేమిటబ్బా!' అని అనుకోకుండా వుండలేకపోయాను! అయితే, ఆ వెంటనే 'పోనీ..... ఈ లావు కూడా మనమంచికే, ఇంటిపనంతా ఎలాంటి అలుపూ, సొలుపూ లేకుండా ఎంచక్కా చేసుకుపోతుంది. సన్నంగా వుండే పిల్లయితే, చీటికీ మాటికీ నీరసాలు పోతూ మనచేత సేవలు చేయించుకుంటుందికూడా' అనుకొని సర్దుకుపోయాను.

ఈ విషయంలో శ్రేయోభిలాషులు చెప్పింది పెడ చెవిని పెట్టింది కూడా అందుకే.

అంతా బాగానే వుంటే 'నా అంత అదృష్టవంతుడెవ్వడుంటాడ'ని నేను విర్ర వీగుతానేమోననో, ఏమో? నేనొకటి తలిస్తే, జరిగింది వేరొకటి.

పెళ్ళయిన మొదటి వారంలోనే ఎలాంటి సారెలు, చీరలు వంటి అనవసరపు హడావుడిలు లేకుండా, నా ఇష్టప్రకారం చాలా సునాయాసంగా కాపురానికి వచ్చిన నా భార్యామణి వచ్చిన మొదటి రోజునే వంటగది ప్రవేశం చేస్తుందనుకుంటే, పడకటింటి అలకపాన్పు చేరింది.

“అదేమిటోయ్..... నేను మీ ఇంట్లో చేయాల్సిన దానిని, నువ్వు మా ఇంట్లో చేస్తున్నావు? మీ అత్తగారికి అనారోగ్యం కదా, కొత్త లేకుండా వంటలో సాయం చేస్తావనుకున్నాను?”


“భలేవారే! నాకసలు వంట చేయడం తెలిస్తేగా... మీ అమ్మగారికి సాయం చేయడానికి. నా పైన ఇద్దరు అక్కలు, నా క్రింద ఇద్దరు చెల్లెళ్ళు. వాళ్ళే అన్ని పనులూ చేసుకుపోయేవాళ్ళు. నేను వంట గది ముఖం చూసిందే లేదు. మీకు తెలీదు గానీ, నాకు కాఫీ కలపడం కూడా రాదంటే నమ్మలేరు మీరు....”

చంద్రకాంతం చాలా తేలిగ్గా చెప్పింది కానీ, అవి మాత్రం నా నెత్తిమీద పిడుగుల్లాగే పడ్డాయి. 'ఇందుకా తల్లీ.... నువ్వు ఇంతవాళ్ళు పెంచింది....' అని అనుకోకుండా ఉండలేకపోయాను.

“కనీసం నీ ఒళ్ళు తగ్గడానికైనా ఇంటిపనులు నేర్చుకో కాంతం!” అన్నాను ఎలా అనాలో తెలీక.

“అయ్యో....! అయ్యో....! ఆ రోజు కార్యం గదిలో 'నా కౌగిలినిండా వున్నావోయ్ కాంతం..... ఐ లైక్ ఇట్.....' అంటూ గొప్పగా పొగిడేసి, ఇవ్వాళిలా అంటారా....? సర్లెండి... నా పుట్టింటికి పంపెయ్యండి పోతాను....” ముడుచుకుపోయి, మూడంకె వేస్తూ ముక్కు చీదేసింది ఆమె.

దాంతో నాకు కాలూ చెయ్యీ ఆడలేదు. పడకగదిలో మా రణగొణ ధ్వనులకు అమ్మా, నాన్నా బెదిరిపోయారు.



## ఎందులో ఉంది?

'అందం' అంటే ఏంటి? అసలు అందం ఎందులో ఉంటుంది? అంటూ ఎదురుప్రశ్న వేస్తుంది సాధిక. సాధిక తెలుగులో మంచి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న హిందీ నటి. రెమ్యూనిరేషన్ విషయంలోగాని కాల్షీట్ల విషయంలోగాని ఏమాత్రం ప్రాబ్లమ్స్ ఇవ్వని నటిగా పేరు తెచ్చుకున్న సాధిక ఎక్స్‌పోజింగ్ విషయంలోను నోప్రాబ్లమ్ చూసే కళ్ళకి కావలసిన అందాలు ప్రదర్శించడంలో నేనెప్పుడూ ముందుంటానంటుంది. అయితే లోపం ఎందులో ఉంది?

"పోన్లేరా! కొత్త కదా! ఇప్పుడే అమ్మాయి నిబ్బంది పెట్టకు...." అంటూ నన్నే దెబ్బలాడారు వాళ్ళు.

అది ఆ రోజుతో సరిపోలేదు.

రోజు రోజుకు రావణ కాష్ఠంలా రగులుతూనే వుండిపోయింది.

కోడలొచ్చి కూడా అమ్మకు ఇంటిడింటెడు చాకిరీ తప్పడం లేదు. అమ్మతో పనులు చేయిస్తూ, తీరికూర్చొనే చంద్రకాంతం, అమ్మ అనారోగ్యంతో మూల్గినా, బడలికతో మంచం మీద వ్రాలినా సణుగుళ్ళ స్తోత్రం పాడ్డం మొదలు పెట్టింది కొత్తగా.

దాంతో ఇంట్లో హోరా హోరీ.... హేరాఫేరీ.... అయిపోయింది!

నాదీ, నాన్నగారిదీ ప్రేక్షక పాత్ర కాక మరేమవుతాయి?!

ఉన్నట్టుండి ఒకరోజు రాత్రి... అదీ ఆమె కాపురానికొచ్చిన మూడో నెలలోనే పడకటింట్లో 'మనం వేరు కాపురం పెడదామండీ!' అంటూ నా చెవిలో ఇల్లు కట్టడం ప్రారంభించింది చంద్రకాంతం.

నాకు అరికాలి మంట నెత్తికెక్కింది గానీ, పడకటిల్లు కిక్కుల్లో ఉన్నందునేమో ఆమెనేమీ అనలేకపోయాను.

ఆడవాళ్ళంతా అంతేనో.... లేక చంద్రకాంతమే అంతేనో తెలీదుగానీ, సరిగ్గా పడకటింట్లోనే ఇలాంటి కడప బాంబులు పేల్చడం ఆడవాళ్ళకు వెన్నతో పెట్టిన విద్యనిపించింది.

ఒక ఏడాది ఎలాగోలా చంద్రకాంతం పోరుని భరించినా, తర్వాత నావల్ల కాదనిపించి ఆమె కోర్కె తీర్చేశాను. దాని ఫలితం అనుభవిస్తున్నంతలోనే పులి మీద పుట్రలా ఇదిగో 'పనిమనిషిని పెట్టండీ!' కోరిక.

"వేరు కాపురం పెట్టించమన్నావు. అలాగే చేశాను. ఇక్కడ మన ఖర్చులకి, అక్కడ వాళ్ళ ఖర్చులకి నా సంపాదన సరిపోవడం లేదు. ఇప్పుడు పనిమనిషంటే మనం భరించగలమా? ఆలోచించు." అన్నాను.

"ఖర్చులనేవి ఎప్పుడూ వుండేవే? అనవసంగా సిగరెట్లకు మీరెంత తగలేయ్యడం లేదూ? అవి తగ్గించుకుంటే, పనిమనిషికి జీతం ఈజీగా ఇవ్వగలం" తన పంతమే నెగ్గాలనుకొనే ఆమె ప్రయత్నం ముమ్మరమయ్యింది.

"పోనీ ఒకపని చేస్తే.... నీవు కోరినట్లు పనిమనిషిని పెడతాను. అందుకు ప్రతిగా అమ్మా, నాన్నని ఇక్కడకు తీసుకు వచ్చేద్దాం.... అప్పుడు ఖర్చు కూడా కలిసొస్తుంది, సరేనా?!...." గాలిలో బాణం వేస్తున్నట్టు అన్నాను.

"బాగుంది వరస... బోడి గుండుకూ, మోకాలుకు ముడి పెట్టడం అంటే ఇదే! సర్లెండి... మీరెప్పుడు నాకోరికలు తీర్చారనీ..." అలవాటుగా ముక్కు చీదేసి మూడంకె వేసేసింది చంద్రకాంతం.

'ఆడాళ్ళూ మీకు జోహార్లని...' అనుకున్నాను.

ఆమె వీరంగానికి మతిపోయి, యధావిధి బ్రతిమలాటలో పడ్డాను.

ఇలా అనేకానేక రాత్రులు గడిచిం తర్వాత 'ఓ దుర్ముహూర్తపు ఉదయపు వేళ?' పనిమనిషి అనబడే ఓ ఆడశాల్తీ మా ఇంట అడుగుపెట్టింది.

ఆమెరాక మా ఇంట ఏరువాక అని పెళ్ళికాక ముందు భార్యామణిని ఊహించుకొని అనుకున్నాను గానీ, ఇప్పుడు పనిమనిషిరాక అందుకు సాక్ష్యం అవుతుందని కలలోకూడా తలపోయలేదు.

పనిమనషి వచ్చాక మా ఆవిడ మా బాగా సుఖపడిపోవడం మాట అటుంచి, నేను ఆమె వచ్చీరాని వంటకాల బారినుండి బయటపడ్డానన్నది నిజం.

మా పనిమనిషి మాలక్ష్మిది నిజంగా అమృత హస్తం!

చక్కగా పనులు చేయడంతో పాటు, ఇంకా చక్కగా వండి వడ్డించడం కూడా ఆమెకి కరతలామలకం.

రకరకాల వంటలు రుచిగా, శుచిగా వండి వడ్డిస్తుంటే నేను ఎంచక్కగా లొట్టలేస్తూ భుజిస్తున్నాను. త్వరలో నేను మా ఆవిడ శరీరాకృతిని బీట్ అవుట్ చేసే స్థాయికి ఎదుగుతాననే భయంల లోపలున్నా, మా లక్ష్మి చేతి రుచి ఆభయాన్ని కూడా మైమరపిస్తుందంటే నమ్మాలి.

మాలక్ష్మి పేరుకైతే పని మనిషేగాని నిజానికి మా ఇంటి మనిషైపోయింది.

నేను భోజనం చేస్తున్న ప్రతిసారీ, దేవుడ్నయినా తలచుకోవడం మరచిపోతానేమోగానీ, మాలక్ష్మి పనితనాన్ని పొగడకుండా ఉండలేకపోతున్నాను.

నేనలా ప్రతిరోజూ చంద్రకాంతంలోని అసూయ నా సమస్యలన్నింటికీ పరిష్కారం చెప్పే సులభమైన మార్గంగా అనిపించింది.

మాలక్ష్మి పెళ్ళయినదే! ఏవో కట్నం గొడవల వల్ల భర్తకు దూరంగా వుంటోందట. పాతికేళ్ళ పరువం ఆమె నడకలోనూ, మాటల్లోనూ కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సన్నగా రెక్కపాయలా వుండే మాలక్ష్మి, లావుగా, పుష్టిగా వుండే చంద్రకాంతంని త్రోసిరాజని నా కళ్ళ నిండా కమ్ముకుంటోంది.

ఓరోజు హాల్లో చంద్రకాంతం కూర్చొని టీవి వీక్షణంలో ఉంది.

ఎప్పటిలాగే మాలక్ష్మి నాకు భోజనం వడ్డిస్తోంది.

అలవాటుగా ఆమె చేసిన వంటకాలను ప్రశంసిస్తూనే 'అవునూ ఇంత బాగా చేసే నీ వంటకాలను తినే భాగ్యం మీ ఆయనకెప్పుడు కల్గిస్తావు?' అడిగాను.

నా మాటలకు మాలక్ష్మి సిగ్గుపడి నాదగ్గర్నుంచి వెలుపలికి వెళ్ళిపోతుందనుకున్నాను. కానీ ఆమెలా వెళ్ళలా.

'పోనిద్దురూ! ఎవరి భాగ్యం వారిది. ఎంతబాగా చూసుకున్నా అమ్మగార్లు మీకెప్పుడన్నా వండి, వడ్డించారా? అలాంటప్పుడు కట్నం డబ్బులు సరిగ్గా ముట్టలేదని నన్ను కాపరానికి తీసుకెళ్ళని ఆడికెలా దక్కుతుంది చెప్పండి."

నెమ్మదిగానే అన్నా మాలక్ష్మి మాటలు నా శరీరాన్ని ములుకుల్లా గుచ్చుకుంటే, అప్పుడే టీ.విని విడిచిపెట్టి లోపలికొచ్చిన చంద్రకాంతానికి శూలాల్లా గుచ్చుకున్నాయి. అప్పటికప్పుడు విశ్వ రూపం దాల్చేసిందామె.

"నువ్వు ఈ ఇంటికి పనిమనిషివేగానీ, ఇంటి మనిషివి కాదు. అది మరిచి, అంతరాలు తెలుసుకోకుండా నీ నోటికొచ్చినట్లల్లా మాట్లాడుతున్నావంటే, నీ కుట్ర ఏమిటో తెలుస్తోంది.... ఆయన్ని బుట్టలో వేసుకొని, ఈ ఇంటికి పర్మినెంటు అవుదామనేగా....?" డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి, మాలక్ష్మిని కొట్టేంత పనిచేసింది.